క్లుప్తంగా

వైభవంగా నృసింహుడి కల్యాణం


కల్యాణం జరిపిస్తున్న భక్తులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయ ఆవరణలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవాలు ఘనంగా ముగిశాయి. మూడో రోజు బుధవారం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భవాని శ్రీరామలింగేశ్వరస్వామి, పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహాలకు ప్రత్యేకాలంకరణ, పూజలు చేశారు. యజ్ఞయాగాలు, పూర్ణాహుతి చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎల్లమ్మ ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, అర్చకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం


రాజ్‌భూపాల్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

పహాడీషరీఫ్: బీజేపీ రంగారెడ్డి రూరల్ జిల్లా నూతన అధ్యక్షుడిగా నియమితులైన పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్‌ను.. పార్టీ మున్సిపల్ ఓబీసీ సెల్ అధ్యక్షుడు పెరమోని నరేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక నాయకులు గుజ్జుల పద్మారావు, కోట్ల రంగనాథ్, నందీశ్వర్, గుర్జని గణేశ్ గౌడ్, మహ్మద్ నయీం, జగదీశ్, బెల్లి గణేశ్, ప్రవీణ్‌తో ఆయన నివాసంలో కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

పన్నులు తగ్గించాలని వినతి


కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న బీఆర్‌ఎస్ మాజీ కార్పొరేటర్లు

మీర్‌పేట: మీర్‌పేటలో పన్నులు తగ్గించాలని కోరుతూ బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మాజీ కార్పొరేటర్లు బుధవారం కమిషనర్ జ్ఞానేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిద్దాల బీరప్ప, అనిల్‌యాదవ్, ఉయ్యాల నవీన్‌గౌడ్, దోమలపల్లి రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీలో కంటే మీర్‌పేటలోనే ప్రజల నుంచి అధికంగా ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి చొరవతో పాత బకాయిలకు విధించిన వడ్డీలో వన్‌టైం సెటిల్‌మెంట్ పథకంలో 90 శాతం మాఫీ చేశారని తెలిపారు. దాంతో పాటు ఇదివరకే వడ్డీ చెల్లించిన వారికి వచ్చే సంవత్సరం పన్నులో సర్దుబాటు ఇచ్చేలా కృషిచేశారని, ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కార్పొరేషన్ ప్రజల తరఫున వారు కృతజ్ఞతలు తెలిపారు. పన్నుల తగ్గింపు విషయమై ఎమ్మెల్యే ఇప్పటికే ఉన్నతాధికారులకు లేఖలు రాశారని, త్వరలోనే ప్రజలకు ఊరట లభిస్తుందన్నారు.

వినూత్న విద్యావిధానాన్ని అవలంభిస్తున్నాం



ప్రత్యేక శిక్షణ శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

మీర్‌పేట: క్రీడో పరికరాల ద్వారా విద్యార్థులకు చిన్ననాటి నుంచే చదువు మీద సంపూర్ణ అవగాహన, ఆసక్తి కలిగేలా చేస్తున్నామని లార్డ్స్ విద్యాసంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప అన్నారు. మీర్‌పేట ఆర్ఎన్‌రెడ్డినగర్‌లోని లార్డ్స్ పాఠశాలలో బుధవారం చిన్నారులకు ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలు, ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా తమ విద్యాసంస్థల్లో వినూత్న విద్యావిధానాన్ని అవలంభిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ సిద్దాల శ్రీలత, డీన్ సతీశ్‌కుమార్, ప్రిన్సిపాల్ ఎస్.కిషన్‌రావు, ఇన్‌చార్జి ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ముంచుకొస్తున్న గడువు

- సగానికి చేరుకోని లక్ష్యం
- మొత్తం రూ.39 కోట్లు.. వచ్చింది 18.65 కోట్లే
- ఇంటి పన్ను వసూలులో అధికారుల నిర్లక్ష్యం
- వెనుకబడిన బడంగ్‌పేట్ కార్పొరేషన్!



బడంగ్‌పేట కార్పొరేషన్ కార్యాలయం

బడంగ్‌పేట్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం గడువు ముంచుకొస్తున్న నేపథ్యంలో మున్సిపాలిటీ అధికారులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ఇంటి పన్ను లక్ష్యం చేరువకు మరో మూడు నాలుగు రోజులే ఉండటంతో చెమటోడుస్తున్నారు. విస్తృతంగా పర్యటిస్తూ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. టాక్స్ రాబడుతున్నారు. అయినప్పటికీ.. సగానికి సగం కూడా వసూలు చేయలేక పోవడం విమర్శలకు తావిస్తోంది. బడంగ్‌పేట్ కార్పొరేషన్ వార్షిక పన్ను టార్గెట్ రూ.39 కోట్లు. కానీ ఇప్పటి వరకు ప్రజల నుంచి రాబట్టింది రూ.18.65 కోట్లు మాత్రమే. ఆర్థిక సంవత్సరం మరో 72 గంటల్లో ముగియనున్న నేపథ్యంలో 50శాతం వసూలు కాకపోవడంతో అధికారుల పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా.. బడంగ్‌పేట్ నగరపాలక సంస్థ రాష్ట్రంలో టాప్ 5లో ఒకటి. అలాంటి కార్పొరేషన్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పన్ను వసూలు విషయంలో వెనుకబడటం విస్మయానికి గురిచేస్తోంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా, రికార్డులను పరిశీలిస్తే.. 2 నుంచి ఐదుకు, 5 నుంచి 10వ స్థానంలోకి వెళ్లనున్నట్లు స్పష్టం మవుతోంది.

సిబ్బందికి బెదిరింపులు

పన్ను వసూలు విషయంలో పురపాలక సిబ్బంది ఇంటి పన్నుకు ప్రాధాన్యతిస్తున్నారు. మొండి బకాయిదారులకు అవగాహన కల్పించి రాబడుతున్నారు. అయినప్పటికీ వినని వారికి రెడ్ నోటీసులు జారీ చేస్తున్నారు. ఇంకా మొండికేసిన వారి ఇళ్లకు డ్రైనేజీ, తాగునీరు కట్ చేస్తూ ముక్కుపిండి పన్ను వసూలు చేస్తున్నారు. మొండి బకాయిదారులకు ఇలా చేస్తేనే వింటారని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. టాక్స్ కట్టాలని ఇంటికి వెళ్తున్న తమపై.. కొందరు యజమానులు బెదిరింపులకు పాల్పడుతున్నారని పుర సిబ్బంది ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వాళ్లు తెలుసు.. వీళ్లు తెలుసంటూ ఆగ్రహం వ్యక్తచేస్తున్నట్లు పేర్కొంటున్నారు. పన్ను కట్టకుండా ఇలా తమను బెదరకొడితే ఎలా పలువురు అధికారులు వాపోతున్నారు.

పౌల్ట్రీఫారాల బకాయి రూ.8 కోట్లు!

గతంలో ఈ ప్రాంతంలో పౌల్ట్రీఫారాలు ఎక్కువగా ఉండేవి. వాటికి ప్రభుత్వం రాయితీలు ప్రకటించేది. నేడు కోళ్ల ఫారాలు తగ్గిపోయి.. వాటి స్థానాల్లో ఫంక్షన్‌హాళ్లు, కమర్శియల్ భవనాలు, రియల్‌ఎస్టేట్ దందాలు కొనసాగుతున్నాయి. కానీ ఇప్పటికీ వాటి నిర్వాహకులు.. పౌల్ట్రీ ఫారాలు నిర్వహిస్తున్నట్లుగా లెక్కలు చూపుతున్నట్లు సమాచారం. అయితే ఈ లెక్కన మొత్తంగా రూ.8 కోట్ల బకాయి కోళ్ల ఫారాల నుంచే రావలసి ఉందని అధికారులు పేర్కొనడం గమనార్హం. పౌల్ట్రీఫారాల జోలికి వెళ్లవద్దని ప్రభుత్వం ఆంక్షలు విధించడంతో.. వ్యాపారులకు కలిసి వస్తోంది.

పెద్దలను వదిలిపెట్టి..

మున్సిపాలిటీకు పన్ను రూపంలో అధిక మొత్తంలో బకాయి ఉన్నవారిని వదిలి.. బాలాపూర్‌లోని ఎస్సీ బస్తీలో పేద పిల్లలు విద్యనభ్యసిస్తున్న ఓ ప్రైవేట్ పాఠశాల ఎదుట కార్పొరేషన్ సిబ్బంది ధర్నా చేయడం విమర్శలకు తావిస్తోంది. పెద్ద మొత్తంలో బకాయి ఉన్న బడా విద్యాసంస్థలను వదిలి, చిన్న పాఠశాల ఎదుట ధర్నా చేయడం ఏంటని అధికారుల తీరును ప్రజలు తప్పుపడుతున్నారు.

ఎవరినీ వదిలిపెట్టం



నెలాఖరు వరకు టార్గెట్ పూర్తి చేస్తాం. అన్ని డివిజన్లలోని ఇళ్లు, కార్యాలయాలకు వెళ్లి పన్నుల గురించి ప్రజలకు అవగాహన కల్పించి వసూలు చేస్తున్నాము. అక్కడక్కడ కొందరు.. మున్సిపల్ సిబ్బందిని బెదిరిస్తున్నారని తెలిసింది. టాక్స్ చెల్లించకుంటే ఎంతటివారినైనా వదిలిపెట్టం. మొత్తం రాబడతాం.

– పి.సరస్వతి, కమిషనర్

మండలాన్ని విలీనం చేసేవరకు పోరాటం

మహేశ్వరం ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ వత్తుల రఘుపతి


మాట్లాడుతున్న రఘుపతి

మహేశ్వరం: మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేసేవరకు ఉద్యమాన్ని ఆపేది లేదని, మరింత ఉధృతం చేస్తామని మహేశ్వరం ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ వత్తుల రఘుపతి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కర్నాటి మనోహర్ కాంప్లెక్స్‌లో ఫ్యూచర్ జేఏసీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలను ఫ్యూచర్ సిటీలో విలీనం చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామన్నారు. గ్రామాల్లో పర్యటించి ఫ్యూచర్‌లో విలీనమైతే కలిగే లాభాల గురించి తెలియజేస్తూ ప్రజాభిప్రాయ సేకరణ తీసుకుంటామన్నారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్‌తో కలిసి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును జేఏసీ నాయకులందరం కలిసి మండలాన్ని విలీనం చేయాలని కోరామని, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. అన్ని రాజకీయ, ప్రజా సంఘాలతో కలిసి ఫ్యూచర్ సిటీ జేఏసీ ఏర్పాటు చేసి, ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నామని తెలిపారు. మహేశ్వరం పేరుతో మహానగరం ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రజలను భాగస్వామ్యం చేసి పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. అంతకుముందు జేఏసీ నాయకులు భవిష్యత్తులో చేయబోయే కార్యక్రమాల గురించి చర్చించారు. కార్యక్రమంలో జేఏసీ గౌరవ అధ్యక్షుడు కర్నాటి మనోహర్, ప్రధాన కార్యదర్శి వర్కల యాదగిరిగౌడ్, నాయకులు వి.మల్లేశ్‌యాదవ్, కడారి జంగయ్య యాదవ్, కర్రోళ్ల చంద్రయ్య, ఎద్మ మోహన్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, సుదర్శన్‌యాదవ్, శ్రావణ్, దత్తునాయక్, సుభాష్, ప్రవీణ్, పాండు నాయక్, సత్యం, గోపాల్‌నాయక్, ధన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మొయినాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శివరామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొయినాబాద్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని 2వ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్, జేబీఐటీ కళాశాల, భాస్కరా మెడికల్ కళాశాల, స్వామినారాయణ గురుకుల్ పాఠశాల తదితర ప్రాంతాల్లో గురువారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అంతరాయానికి వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

ఆస్తి పన్నుపై వడ్డీలో రాయితీ

మున్సిపల్ కమిషనర్ సునీత

షాద్‌నగర్: ప్రభుత్వం వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద ఆస్తి పన్నుపై వడ్డీలో రాయితీని ఇస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సునీత కోరారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. ఆస్తి పన్నుపై వడ్డీలో 90శాతం రాయితీని ఇవ్వాలని మున్సిపల్ శాఖ నిర్ణయించినట్లు తెలిపారు. మార్చి 31 నాటికి ఆస్తి పన్ను బకాయిలపై 10 వడ్డీ చెల్లించిన వారికి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ వర్తిస్తుందని తెలిపారు. ఆస్తి పన్ను బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పంచాయతీ కార్యదర్శికి నివాళి



కార్యదర్శి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ శైలజ, పంచాయతీ కార్యదర్శులు

మహేశ్వరం: నాగుల్‌దోని తండా పంచాయతీ కార్యదర్శి బోయ సక్కుబాయి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడం బాధాకరమని ఎంపీడీఓ శైలజ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓ, సిబ్బందితో కలిసి.. సక్కుబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సక్కుబాయి సక్రమంగా విధులు నిర్వహిస్తూ అందరితో కలివిడిగా ఉండేదన్నారు. ఆమె మరణం తోటి ఉద్యోగులు, తమకు తీరని లోటన్నారు. ఆమెతో పాటు భర్త పాండు చికిత్స పొందుతూ మరణించడం బాధాకరమన్నారు. అనంతరం స్వగ్రామం కల్వకుర్తి మండలం రఘుపతిపేట గ్రామంలో జరిగే అంత్యక్రియలకు పంచాయతీ కార్యదర్శులు తరలి వెళ్లారు. కార్యక్రమంలో ఎంపీఓ రవీందర్‌రెడ్డి, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.శివకుమార్, పంచాయతీ కార్యదర్శులు జావీద్, నవీన్, రాము, శ్రీనివాస్, పరమేశ్, జంగయ్య, సుజాత, అలువేలు, లక్ష్మి, శిరీష, ఆశ్విణి, కల్పన, పుష్పలత, లక్ష్మి, శివ, జయదీప్, సందీప్, కిష్టయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయ ఫలితాల్లో సత్తాచాటిన 'రేయాన్'

నాగోలు: నవోదయ స్కూల్ 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో నాగోలు బండ్లగూడలోని రేయాన్ నవోదయ కోచింగ్ స్కూల్‌కు చెందిన 42 మంది ప్రతిభ చూపి.. నవోదయకు ఎంపికైనట్లు స్కూల్ డైరెక్టర్ జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం స్కూల్‌లో సదరు విద్యార్థులను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 25 ఏళ్లుగా తమ స్కూల్‌లో కోచింగ్ పొందిన వందలాది మంది విద్యార్థులు నవోదయతో పాటు, సైనిక్, ఆర్ఎంఎస్ స్కూళ్లకు ఎంపికైనట్లు తెలిపారు.


నవోదయలో సీట్లు సాధించిన విద్యార్థులు..

రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు

షాద్‌నగర్: వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా ప్రభుత్వం మహిళా రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలను అందజేస్తుందని మండల వ్యవసాయ అధికారి నిషాంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోటవేటర్, సీడ్ ఫర్టిలైజర్ డ్రిల్, కల్టివేటర్, పవర్ స్ప్రేయర్, మ్యానువల్ స్ప్రేయర్, బ్రష్ కట్టర్, బండ్ ఫార్మర్ వంటి వ్యవసాయ పరికరాలను వ్యవసాయ శాఖ మహిళా రైతులకు సబ్సిడీపై అందజేస్తుందని తెలిపారు. భూమి ఉన్న మహిళా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు శుభపరిణామం

మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్

కందుకూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో రాత్రి వేళలో సైతం వెలుగులు నింపేలా హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తుండటం శుభపరిణామమని మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ అన్నారు. బుధవారం సాయంత్రం కందుకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను గ్రామస్తులతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బి.ప్రశాంత్‌కుమార్, కె.విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల ఆవరణలో..

మండలంలోని కొత్తగూడ పరిధిలో గల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ఆవరణలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను బుధవారం గ్రామస్తులు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు బొక్క సంజీవరెడ్డి, బొక్క నరేందర్‌రెడ్డి, దామోదర్ రెడ్డి, సొడపు శేఖర్‌గౌడ్ మాట్లాడారు. హైమాస్ట్ లైట్ల


పాఠశాలలో హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, నాయకులు

ఏర్పాటుకు మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్‌తో పాటు గ్రామానికి చెందిన బొక్క భూపాల్‌రెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. వారికి గ్రామస్తుల తరఫున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు కుమ్మరి కృష్ణయ్య, సొడపు శంకర్‌గౌడ్, బొక్క దేవేందర్‌రెడ్డి, బొక్క హనుమంత్ రెడ్డి, ఎండీ ఖదీర్, బొక్క రాజశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ భార్గవి, ఉపాధ్యాయులు అర్చన, క్లారా, మంజుల, రమాదేవి, ప్రమోద, విమల, విజయలక్ష్మి, అమృత, స్రవంతి పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడికి కృతజ్ఞతలు

కందుకూరు: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా పదేళ్ల పాటు పార్టీకి, నాయకులు, కార్యకర్తలకు బొక్క నర్సింహారెడ్డి ఎనలేని సేవలు అందించారని పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి, నాయకులు పల్లె కృష్ణగౌడ్, జిట్టా రాజేందర్‌రెడ్డి, పండల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం వారు పార్టీ నాయకులతో బొక్క నర్సింహారెడ్డిని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో ఆయన అందరికీ అందుబాటులో ఉంటూ పేద, బడుగు బలహీన వర్గాలకు చేయూతనందించారన్నారు. రెండు పర్యాయాలు మండల పరిషత్‌ను దక్కించుకోవడంలో ఆయన కీలక పాత్ర పోషించారని కొనియాడారు. అనంతరం నూతన జిల్లా పార్టీ అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్‌ను కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బొక్క సత్యనారాయణరెడ్డి, ఎగ్గిడి సత్తయ్య, గౌర ప్రభాకర్, బక్క మల్లేశ్, కె.బాబు, ఏ.యాదగిరి, ఎస్.భూమిరెడ్డి, ఎ.అశోక్‌రెడ్డి, కృష్ణగౌడ్, శ్రీశైలంనాయక్, రామకృష్ణ, నవీన్, ఆంజనేయులు, వెంకట్‌రెడ్డి, దయాకర్ రెడ్డి, కుమార్, రఘునందన్, శ్రీనివాస్, రాములు, సాయి, అనిల్, భాస్కర్, నరేశ్, నరేందర్‌ముదిరాజ్ పాల్గొన్నారు.


బొక్క నర్సింహారెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న నాయకులు

బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలి

యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శి దామోదర్‌యాదవ్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ విస్తరణలో భాగంగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలని యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శి దామోదర్‌యాదవ్ అన్నారు. బుధవారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో గొర్ల కురుమలు 70లక్షల మంది ఉన్నారని, బీసీ నేత బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఇచ్చి వారి ఆత్మగౌరవాన్ని గౌరవించాలని కోరారు. రాష్ట్రంలో యాదవ వర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ఏకైన వ్యక్తి ఐలయ్య అని అన్నారు. ప్రభుత్వం నిర్వహించిన సర్వే ప్రకారం గొల్ల కురుమలు జనాభాలో రెండో స్థానంలో ఉన్నారన్నారు. గొల్లకురుమ సామాజిక వర్గానికి చెందిన ఐలయ్యకు మంత్రి కల్పిస్తే సమన్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో నాయకులు అంజన్‌యాదవ్, చెన్నకేశవులుయాదవ్, తిరుమలేశ్ యాదవ్, భాను ప్రకాశ్‌యాదవ్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు

ఏఈ ఈశ్వర్

కేశంపేట: వేసవి కాలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నట్లు ఏఈ ఈశ్వర్ తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. సబ్‌స్టేషన్‌కు గతంలో మహబూబ్‌నగర్ జిల్లాలోని బాలానగర్ నుంచి 33 కేవీ విద్యుత్‌లైన్ ఉండటంతో చాలాసార్లు విద్యుత్ సమస్యలు ఏర్పడ్డాయన్నారు. మండల పరిధిలోని అల్వాల గ్రామంలో 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఉండడంతో అక్కడి నుంచి 33 కేవీ విద్యుత్ లైన్‌ను నూతనంగా వేశామని తెలిపారు. వేసవికాలంలో ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద లోఓల్టేజీ సమస్యలు తలెత్తకుండా అర్తింగ్‌లకు ట్యాంకర్‌ల ద్వారా నీటిని సరాఫరా చేస్తున్నామన్నారు. మండలంలో ఇప్పటివరకు లోఓల్టేజీ సమస్యలు తలెత్తలేదని, గ్రామాల్లో 24 గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ సమస్యలు ఏర్పడితే సిబ్బంది అందుబాటులో ఉంటారని, సొంతంగా ఎలాంటి పనులు చేసుకోవద్దని ఆయన కోరారు.


ట్రాన్స్‌ఫార్మర్‌కు ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్న సిబ్బంది

ఉపాధి హామీ.. అందని కూలి

- మండు వేసవిలో పనిచేసినా సకాలంలో అందని బిల్లులు
- ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కూలీలు
- పనులకు రావడానికి వెనుకడుగు

కొందుర్గు: కనీస వేతనం గిట్టుబాటు కాకపోయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులకు ఉపాధి కూలీలు వస్తున్నారు. అయినా వారికోసారి చెల్లించే బిల్లులు మూడునెలల నుంచి అందకపోవడంతో వారు అవస్థలు పడుతున్నారు. వారానికోసారి వేతనాలు వస్తాయని పనులకు వస్తున్న కూలీలకు పస్తులు తప్పడం లేదు. అధికారులు దృష్టిసారించి సకాలంలో పెంచిన వేతనాలు అందించాలని కోరుతున్నారు.

గిట్టుబాటు కావడం లేదని..

మండలంలోని 22 గ్రామపంచాయతీలకు సంబంధించి దాదాపు 5వేలకు పైనే జాబ్‌కార్డులు ఉన్నాయి. రోజుకు సగటున 1500 మంది కూలీలు ఉపాధి పనులు చేసేవారు. కానీ కూలీలకు సరిగా గిట్టుబాటు కావడం లేదని, సకాలంలో కూలీ డబ్బులు రావడం లేదని పనులకు వెళ్లడానికి వెనుకడుగు వేస్తున్నారు. ప్రస్తుతం రోజుకు 800 మంది మాత్రమే కూలీలు పనులకు వెళ్తున్నారు. ఫిబ్రవరి ప్రారంభం నుంచి ఇప్పటివరకు చేసిన పనులకు కూలీ డబ్బులు అందలేదు. బయట కూలీకి వెళ్తే రోజుకు రూ.500లు ఇస్తున్నారని, ఉపాధి హామీలో కేవలం రూ.300 మాత్రమే ఇస్తున్నారని కూలీలు వాపోతున్నారు. సాధారణంగా ప్రతిఏటా వేసవికాలంలో కూలీలకు ఫిబ్రవరిలో 20శాతం, మార్చిలో 30శాతం కూలీరేట్లు పెంచడం జరిగేది. కానీ ఈ ఏడాది ఇంకా కూలీ రేట్లు పెంచడం లేదు. దానికి తోడు తమకు కూలీ డబ్బులు సకాలంలో రావడం లేదని కూలీలు ఆరోపిస్తున్నారు. దీంతో మార్చి వరకు 2.50లక్షల పనిదినాలు పూర్తి కావాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం ఒక లక్ష పనిదినాలు పూర్తయినట్లు తెలిసింది.


కొందుర్గులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కూలీ రేట్లు పెంచాలి



మండుతున్న ఎండలకు ఓర్చుకొని కూలీలు పనులు చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే కూలీ డబ్బులు ఎందుకు సరిపోవడం లేదు. నిత్యావసర సరుకుల రేట్లు విపరీతంగా పెరిగినా కూలీరేట్లు పెంచడం లేదు. కూలీల రేట్లు వెంటనే పెంచాలి. కూలీలకు పని ప్రదేశంలో టెంట్లు వేయించాలి. ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలి

–బుద్దుల జంగయ్య, సీపీఐ నాయకుడు

ప్రభుత్వానికి నివేదిస్తున్నాం



కూలీలందరికీ ఉపాధి కల్పించడమే సర్కారు లక్ష్యం. కూలీల హాజరును ఎప్పటికప్పుడూ నమోదు చేసి, కూలీ డబ్బుల కోసం ప్రభుత్వానికి నివేదిస్తున్నాం. కాస్త ఆలస్యమైనా డబ్బులు వస్తున్నాయి. నాలుగైదు వారాలకొకసారి కూలీల డబ్బులు వారి ఖాతాల్లో జమ అవుతున్నాయి.

–లక్ష్మి అనురాధ, ఎంపీడీఓ